సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 15 । ఆగస్టు । 2025


నా ధైర్యం.. మువ్వెన్నల పతాకం


జయ జయ ప్రియభారతి...


దేశం మనదే.. తేజం మనదే.. ఎగురుతున్న జెండా మనదే

భీమిలి తీరంలో భారతదేశ ఆకారంలో కూర్చొని.. దేశభక్తిని చాటుతున్న భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



విజయీ విశ్వ తిరంగా ప్యారా..


పాడవోయి భారతీయుడా..

ఊరూవాడా ఒక్కటైంది. గుండె నిండా దేశభక్తితో.. భరతమాత ముద్దు బిడ్డల చేతుల్లో మువ్వెన్నెల పతాకం గర్వంగా ఎగురుతోంది. ఇది కేవలం పతాకం కాదు. 146 కోట్ల భారతీయుల సమైక్యతకు తలమానికం. కాషాయం త్యాగానికి, తెలుపు శాంతికి, ఆకుపచ్చ ప్రగతికి ప్రతీకలుగా నిలుస్తూ... స్వాతంత్య్ర స్ఫూర్తిని రగిలిస్తోంది. ఈ పంద్రాగస్టు సందర్భంగా నగర వీధులు త్రివర్ణ శోభతో వెలిగిపోతున్నాయి. చిన్నారుల చేతుల్లోని జెండాలు, భవిష్యత్ భారతదేశానికి భరోసానిస్తున్నాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగంలో నలుగురికి అవకాశం



విశాఖ సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ కమిటీలో విశాఖ జిల్లా నుంచి ముగ్గురు చోటు కల్పించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టినట్లు తెలిపింది. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శులుగా చందక అప్పలస్వామి(భీమిలి), కంకల ఈశ్వరరావులను, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శులుగా జగ్గుపల్లి నరేష్ (భీమిలి), కోరాడ చంద్రమౌళి(పెందుర్తి)ని నియమించారు.

కిరండూల్ పాసింజర్‌కు అదనపు కోచ్



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం పాసింజర్‌కు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్‌కు ఈనెల 15 నుంచి 31వ తేదీ వరకు, కిరండూల్–విశాఖపట్నం (58502)పాసింజర్‌కు ఈనెల 16 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

నేడు, రేపు మాంసం దుకాణాలకు సెలవు

డాబాగార్డెన్స్: నగర పరిధిలోని మాంసం, చికెన్, చేపల దుకాణాలకు ఈ నెల 15, 16 తేదీల్లో సెలవు ప్రకటించినట్లు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 15న స్వాతంత్య్ర దినోత్సవం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత దుకాణాలు, జంతు వధశాలలు మూసివేయాలని, నిబంధనలు అతిక్రమించి మాంసం విక్రయాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల వాయిదా

బీచ్‌రోడ్డు : ఈనెల 16వ తేదీన నిర్వహించాల్సిన స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. వివిధ వేడుకలు, పండగల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు. నాలుగో శనివారం అనగా 23వ తేదీన యథావిధిగా కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

లడ్డూ విక్రయాల నిలిపివేత



కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి, గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లడ్డూల విక్రయాలు మూడు రోజుల పాటు నిలిపివేసినట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. తిరుపతిలో కురుస్తున్న వర్షాలకు కారణంగా రవాణాకు అంతరాయం ఏర్పడటంతో లడ్డూలు ఇక్కడకు చేరలేదని పేర్కొన్నారు.

రోడ్డుప్రమాద బాధితుల కోసం సహాయ కేంద్రం ఏర్పాటు



విశాఖ లీగల్ : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించే విధంగా విశాఖ పోలీసు కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు సహాయం కోసం టోల్ ఫ్రీ నంబరు 7995095793లో సంప్రదించవచ్చన్నారు. ప్రమాదాలకు గురైన బాధితులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన ఎఫ్ఐఆర్, పోస్ట్‌మార్టం నివేదిక, శవ పంచనామా నివేదిక, వైద్య ధృవీకరణ పత్రాలు, వాహన బీమా పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు, ఇతర డాక్యుమెంట్లు, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్ ట్రిబ్యునల్(ఎంఏసీటీ)లో నష్టపరిహారం కోసం కేసు వేయడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఈ కేంద్రం నుంచి అందించడం జరుగుతుందన్నారు. ఇతర న్యాయపరమైన సేవల కోసం హెల్ప్‌లైన్ నంబరు 15100ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఎక్సైజ్ సీఐపై రుబాబు?

- తనిఖీలకు వెళ్లిన సమయంలో బార్ యజమాని అరుపులు, కేకలు
- తమ బార్లలో తనిఖీలు ఎందుకంటూ నిలదీత
- జోక్యం చేసుకున్న ఓ ఉన్నతాధికారి
- సర్దుబాటు చేసి చక్కబెట్టుకున్నట్లు విమర్శలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: నగరంలో ఓ బార్ యజమాని ఏకంగా ఎక్సైజ్ సీఐపై రుబాబుకు దిగినట్లు తెలుస్తోంది. తన బారులో తనిఖీలు ఎలా చేస్తారంటూ ఏకంగా అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అంతేకాకుండా సదరు సీఐపై అరుపులు, కేకలతో విరుచుకుపడినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో అనధికారికంగా ఇతర దేశాల మద్యంతో పాటు డిఫెన్స్ మద్యం లభిస్తోంది. ఇటీవల ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో కూడా మద్యం పట్టుబడింది. స్టీల్‌ప్లాంట్ సీజీఎం స్థాయి అధికారి ఇంట్లో పదుల సంఖ్యలో ఇతర రాష్ట్రాల మద్యం సీసాలు దొరికాయి. ఈ నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు నగరంలోని బార్లు, మద్యం షాపుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. నగరంలో ప్రధానమైన కూడలి వద్ద ఉన్న బారులో తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్ సీఐపై సదరు బార్ యజమాని రుసరుసలాడటమే కాకుండా అరుపులు, కేకలతో నిలువరించే ప్రయత్నం చేసినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో సదరు బారులో కొన్ని డిఫెన్స్ బాటిళ్లు కూడా అనధికారికంగా లభించినట్టు తెలుస్తోంది. దీనిపై ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారి ఒకరు రంగంలోకి దిగి సర్దుబాటు చేసినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో భారీగానే నగదు చేతులు మారినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే ఎక్సైజ్ సీఐతో ఆ బారు యజమాని వ్యవహరించిన తీరును.. సీసీ కెమెరాలను పరిశీలిస్తే బట్టబయలయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నా వద్దే తనిఖీలకు వస్తారా?

వాస్తవానికి సదరు బారు యజమాని.. గతంలో వేరే వ్యాపారంలో అక్రమంగా భారీగా సంపాదించి లిక్కరు వ్యాపారంలోకి అడుగుపెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేకంగా కొద్ది మందితో జతకట్టి ఏకంగా 10 బార్లు, 10 వైన్ షాపులను దక్కించుకున్నారు. అంతేకాకుండా ప్రీమియం షాపును కూడా అధికార పార్టీకి బాగా దగ్గరి వారిమంటూ చెప్పుకుంటున్న వారితో కలిసి నెలకొల్పారు. వీరితో జతకలిసిన తర్వాత మరింతగా రెచ్చిపోతున్నట్టు తెలుస్తోంది. అధికారపార్టీకి బాగా దగ్గరని ఇంటి పేరుతో సహా చెప్పుకునే వారితో కలిసి వ్యాపార భాగస్వామ్యం ఉండటంతోనే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే బార్లలో తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్ సీఐపై నోరుపారేసుకున్నట్టు తెలుస్తోంది. తన బారులోనే తనిఖీలు చేస్తారా? అంటూ రెచ్చిపోయినట్టు సమాచారం. అయితే, ఆయనకు చెందిన రెండు బారుల్లో కూడా కొన్ని ఇతర మద్యం బాటిళ్లు దొరికినట్టు తెలుస్తోంది. అయితే, ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారి ఒకరు రంగంలోకి దిగి సర్దుబాటు చేయడంతో పాటు తను కూడా చక్కబెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మాధవధారలోని తన కార్యాలయానికి పిలుపించుకుని మరీ సర్దుబాటు చేసినట్టు విమర్శలున్నాయి. ఈ వ్యవహారంలో రూ.15 లక్షల మేర చేతులు మారినట్టు ప్రచారం జరుగుతోంది.

మరో షాపు రాకుండా...!

వాస్తవానికి విశాఖ నగరంలో రెండు ప్రీమియం షాపుల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. అయితే, తాము ఏర్పాటు చేసిన తర్వాత సాధ్యమైనంత ఆలస్యంగా రెండో ప్రీమియం షాపు తెరిచేలా అడ్డుకునే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. అసలు షాపు ఏర్పాటుకు అనువైన స్థలం దొరకకుండా అడ్డుకునే ప్రయత్నం చేసి సఫలమయ్యారు. కాకినాడకు చెందిన వ్యక్తికి వచ్చిన షాపు ఏర్పాటు కాకుండా గత మూడు నెలలుగా అడ్డుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. చివరకు తనకు దక్కిన ప్రీమియం షాపులో రాయలసీమకు చెందిన అధికారపార్టీ సామాజికవర్గానికే చెందిన వారికి భాగస్వామ్యం ఇవ్వడంతో చివరకు ఎలాగోలా నెలకొల్పేందుకు అవకాశం లభించినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ మరింత ఆలస్యం చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

స్వాతంత్య్ర దినోత్సవానికి సర్వం సిద్ధం


విద్యుత్ కాంతులతో కలెక్టరేట్

బీచ్‌రోడ్డు: పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించనున్న 79వ స్వాతంత్య్ర దినోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. వేడుకల్లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల లక్ష్యాలు, ఫలితాలను వివరిస్తూ 8 విభాగాల ఆధ్వర్యంలో స్టాళ్లు, ఏడు విభాగాల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించనున్నారు. పరేడ్ మైదానంలో పైలట్ వాహనానికి ట్రయల్ రన్ నిర్వహించి సిద్ధం చేశారు. గౌరవ వందనం సమర్పించడానికి, పరేడ్ నిర్వహించడానికి వీలుగా వివిధ రక్షణ బృందాల నుంచి మొత్తం 52 మందికి శిక్షణ ఇచ్చారు. ఎనిమిది పాఠశాలల విద్యార్థులు దేశభక్తిని చాటుతూ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. వివిధ సంక్షేమ పథకాల కింద రూ. 214.99 కోట్ల నగదు ప్రోత్సాహకాలను మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతిభ చూపిన 375 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేయనున్నారు.


సిద్ధమైన జీవీఎంసీ శకటం


అతిథుల కోసం ఏర్పాట్లు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

బీచ్‌రోడ్డు : జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. జిల్లా అధికారులతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా స్థాయి అధికారులు, క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు హెడ్ క్వార్టర్లలోనే ఉండాలన్నారు. ఉద్యోగులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయకూడదన్నారు. జోనల్ ఆఫీసులు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని, ఒకవేళ వేటకు వెళ్లి ఉంటే వెంటనే తీరానికి చేరుకోవాలన్నారు. మ్యాన్ హోల్స్‌పై మూతలు ఉండే విధంగా చూడాలని, డ్రైనేజీలు పూడిపోకుండా పారిశుధ్య కార్మికులు చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. చెట్ల కొమ్మలు ప్రూనింగ్ చేయించాలని, గాలులు వీచి చెట్లు పడిపోతే వెంటనే తొలగించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తీసుకువెళ్లాలన్నారు. కొండ ప్రాంతంలో ఉన్న వారి కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

ముందస్తు చర్యలకు సిద్ధం కండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం

డాబాగార్డెన్స్: నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున.. అధికారులు ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులతో గురువారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. జోనల్ స్థాయిలో లోతట్టు, కొండవాలు ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల కోసం సామాజిక భవనాలను సిద్ధం చేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరూ ఉండకుండా చూడాలని ఆదేశించారు. నగరంలో అన్ని మ్యాన్ హోల్స్‌కు మూతలు వేసి ఉంచాలని, వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని చెప్పారు. వర్షాలు, గాలుల వల్ల చెట్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున, బలహీనంగా ఉన్న చెట్లను తొలగించాలని ఉద్యానవన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనధికార పోస్టర్లు, హోర్డింగ్‌లను తొలగించాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. ప్రజలకు అత్యవసర పరిస్థితిలో సమాచారం అందించేందుకు జోనల్ కంట్రోల్ రూమ్‌లను 24 గంటలు అందుబాటులో ఉంచాలని, అవసరమైతే జీవీఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్‌ను సంప్రదించవచ్చన్నారు. వర్షాల సమయంలో ప్రజలు విద్యుత్ స్తంభాలు, పాత భవనాలు, హోర్డింగ్‌ల దగ్గర ఉండవద్దని కమిషనర్ సూచించారు.

యాచకులు లేని నగరంగా విశాఖ

- జ్యోతిర్గమయ కార్యక్రమానికి శ్రీకారం
- 243 మంది యాచకులను రెస్క్యూ చేసిన పోలీసులు


యాచకులతో కలిసి భోజనం చేస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి


యాచకులు, పునరావాస కేంద్రాల నిర్వాహకులతో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: యాచకులు లేని నగరంగా విశాఖను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పది నెలల కిందట నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తలపెట్టిన 'జ్యోతిర్గమయ' కార్యక్రమానికి ఒక రూపు వచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని యాచకులకు తగిన ఆశ్రయం కల్పించి, వారిని గౌరవప్రదమైన జీవితం వైపు నడిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీపీ తెలిపారు. గురువారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడారు. 'తమసోమా జ్యోతిర్గమయ' అంటే చీకటి నుంచి వెలుగు వైపు ప్రయాణమని వివరించారు. రోడ్లపై భిక్షాటన చేసే నిరాశ్రయులను రోజూ చూసి బాధపడేవాడినని, ప్రతి మనిషి గౌరవంగా జీవించడానికి ప్రయత్నించాలన్నారు. కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, హార్బర్ సీఐ సింహాద్రి నాయుడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ తిరుపతిరావు, సీఐ చప్పా ప్రసాద్(వీఆర్), నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. గురువారం ఒక్క రోజే 243 మంది యాచకులను గుర్తించి, వారికి క్షవరం, స్నానం చేయించి, కొత్త దుస్తులు ఇచ్చి, టిఫిన్‌తో పాటు భోజనం కూడా అందించినట్లు తెలిపారు. 243 మందిలో 45 మంది బాగా ఉండటంతో వారి కుటుంబ సభ్యులను పిలిపించి, అప్పగించినట్లు వివరించారు. మానసిక స్థితి సరిగా లేని 9 మందిని ప్రభుత్వ మానసిక ఆరోగ్య ఆసుపత్రిలో చేర్పించామన్నారు. మిగిలిన 189 మందిని వివిధ పునరావాస కేంద్రాలకు పంపించినట్లు తెలిపారు. భవిష్యత్తులో వీరికి పనులు ఇప్పించడం, పని చేయలేని వారికి ఆశ్రయం కల్పిస్తామన్నారు. ట్రాన్స్‌జెండర్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నందున.. వారికి కూడా పని కల్పించడం లేదా ఆశ్రయం కల్పిస్తామన్నారు. జైలు నుంచి విడుదలైన వారికి కూడా జీవనాధారం కల్పించి గౌరవప్రదంగా బతకడానికి అవకాశం చూపిస్తామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమం మొదటి అడుగు మాత్రమేనని.. నగరంలోని దాతలు ముందుకు వచ్చినట్లయితే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ సీపీ కృతజ్ఞతలు తెలిపారు.

పన్నుల శాఖలో సొంత వాణిజ్యం

- పట్టుబడ్డ ఒడిశా బోటు ఇంజిన్లు మాయం
- అక్రమార్కుడితో చేతులు కలిపిన అధికారులు
- దొరికినవి 18.. లెక్క చూపింది మూడే..
- జీఎస్టీ ఎగవేతతో ప్రభుత్వ ఖజానాకు గండి

సాక్షి, విశాఖపట్నం: వాణిజ్య పన్నుల శాఖ సిబ్బంది ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూర్చడం కంటే.. తమ సొంత వాణిజ్యంపైనే ఎక్కువ మక్కువ చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బిల్లులు లేకుండా సరుకు రవాణా చేస్తూ పట్టుబడితే చాలు.. సంబంధిత వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ కార్యాలయంలో పండగ వాతావరణం నెలకొంటోంది. ఇటీవల ఒడిశా నుంచి అనధికారికంగా తీసుకొచ్చిన బోటు ఇంజిన్ల వ్యవహారం కొందరు సిబ్బందికి కాసుల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. రెండు వాహనాల్లో నిండుగా ఇంజిన్లు పట్టుబడగా.. కేవలం మూడు ఇంజిన్లు మాత్రమే దొరికినట్లు అధికారిక లెక్కల్లో చూపడం పలు అనుమానాలకు తావిస్తోంది. మిగిలిన వ్యవహారాన్ని అక్రమార్కులతో బేరసారాలు ఆడి చక్కదిద్దినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అసలేం జరిగిందంటే.?

ఒడిశా ప్రభుత్వం 'ముఖ్యమంత్రి మత్స్యజీవి కల్యాణ యోజన(ఎంఎంకేవై)'పథకంలో భాగంగా మత్స్యకారులకు కొత్త బోట్లు, ఇంజిన్లు, వలల కొనుగోలుకు రాయితీ అందిస్తోంది. సుమారు రూ.1.50 లక్షల విలువైన ఒక్కో బోటు ఇంజిన్‌ను రూ.84 వేల రాయితీతో కేవలం రూ.66 వేలకే ఇస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ఈ ఇంజిన్ కొనాలంటే అదనంగా జీఎస్టీ భరించాల్సి ఉంటుంది. ఇదే అదనుగా భావించిన విశాఖకు చెందిన ఓ వ్యాపారి ఒడిశాలో మత్స్యకారులకు రాయితీపై అందిన బోట్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి.. ఎలాంటి జీఎస్టీ చెల్లించకుండా వాటిని ఇక్కడకు తీసుకొస్తున్నాడు. గత ఆరు నెలలుగా నెలలుగా ఈ దందా గుట్టుగా సాగుతోంది. విశాఖపట్నంతో పాటు పూడిమడక, నక్కపల్లి, అచ్యుతాపురం తదితర ప్రాంతాల మత్స్యకారులకు వీటిని అమ్ముతున్నట్లు సమాచారం.

వ్యాపారితో బేరసారాలు : పట్టుబడిన ఒక వాహనంలో ఇతర సామగ్రితో పాటు 3 ఇంజిన్లు ఉండగా, మరో వాహనంలో 15 ఇంజిన్లు ఉన్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న వ్యాపారి.. తన దుకాణం ఉన్న సర్కిల్ అధికారుల వద్దకు పరుగున వెళ్లాడు. అక్కడి నుంచి సిబ్బందితో కలిసి కమర్షియల్ ట్యాక్స్ డివిజనల్ కార్యాలయానికి వచ్చినట్లు సమాచారం. పట్టుకున్న సిబ్బందితో వ్యాపారి బేరసారాలు ఆడినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. రెండు వాహనాలను వదిలిపెట్టేందుకు భారీగా ముడుపులు ముట్టజెప్పుతానని వ్యాపారి ఆఫర్ చేసినట్లు తెలిసింది. అయితే రెండు వాహనాలనూ వదిలేస్తే తమకు సమాచారం ఇచ్చిన వ్యాపారులకు అనుమానం వస్తుందని భావించిన సిబ్బంది.. కేవలం 3 ఇంజిన్లు ఉన్న వాహనాన్ని మాత్రమే పట్టుకున్నట్లు చూపిస్తామని చెప్పినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో వాణిజ్య పన్నుల శాఖ ఇంటెలిజెన్స్ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేసినట్లు ఆరోపణలున్నాయి. అనంతరం ఈ కేసును గుట్టుచప్పుడు కాకుండా మూసివేశారు. కేవలం 3 ఇంజిన్లు మాత్రమే పట్టుబడ్డాయని, అందులో ఒకదానికి బిల్లు ఉందని, మిగిలిన రెండు ఇంజిన్లకు బిల్లులు లేకపోవడంతో జరిమానా విధించి వదిలేశామని ఇంటెలిజెన్స్ సిబ్బంది కేసును ముగించారు. ఎక్కువ ఇంజిన్లు ఉన్న వాహనాన్ని రాత్రికి రాత్రే ఆ వ్యాపారి తన దుకాణానికి తరలించుకుపోయినట్లు తెలిసింది. చిన్న గార్మెంట్ బేల్స్ పట్టుకుంటేనే హడావిడి చేసే అధికారులు.. బోటు ఇంజిన్లు పట్టుబడ్డా, విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. మొత్తంగా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన లక్షల రూపాయల జీఎస్టీని కొందరు అధికారులు తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

తోటి వ్యాపారుల సమాచారంతో..

పెద్ద సంఖ్యలో ఇంజిన్లు తెచ్చి తక్కువ ధరకు విక్రయిస్తున్న వ్యాపారి తీరుపై తోటి బోట్ ఇంజిన్ వ్యాపారులకు అనుమానం కలిగింది. పక్కా సమాచారం సేకరించి.. ఏ సమయంలో, ఎన్ని వాహనాల్లో ఇంజిన్లు వస్తున్నాయన్న వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందించారు. దీంతో కమర్షియల్ ట్యాక్స్ సిబ్బంది వలపన్ని జూలై 31న ఆరిలోవ సమీపంలో రెండు వాహనాలను పట్టుకున్నారు. వాస్తవానికి ఒడిశా నుంచి మూడు వాహనాల్లో ఇంజిన్లు రాగా.. ఒక వాహనాన్ని ఆ వ్యాపారి శ్రీకాకుళంలోని తన దుకాణానికి ముందే తరలించేశాడు. మిగిలిన రెండు వాహనాలను విశాఖ వాణిజ్య పన్నుల శాఖ బృందం పట్టుకుంది. ఇక్కడే అసలు కథ మొదలైంది.


వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయ ఆవరణలో బోటు ఇంజిన్ల వాహనం(ఫైల్)

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆరాధ్య


సర్టిఫికెట్‌తో ఆరాధ్య

పరవాడ: భర్నికం శివారులోని బాపడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఒకటో తరగతి విద్యార్థిని ఆరాధ్య బెహ్రా .. తన అసాధారణ జ్ఞాపకశక్తితో అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయుడు కొరుపోలు గంగాధరరావు తెలిపారు. యాదృచ్ఛికంగా ఇచ్చిన ఆంగ్ల అక్షరమాలలోని అక్షరాలను కేవలం 1 నిమిషం 30 సెకన్లలో సరైన క్రమంలో పేర్చడం ద్వారా ఆరాధ్య ఈ రికార్డును సాధించిందని ఆయన వివరించారు. ఎటువంటి సహాయం లేకుండా, కేవలం తన జ్ఞాపకశక్తిని ఉపయోగించి ఈ ఘనతను సాధించిందన్నారు. పాఠశాలలో జూలై 30న జరిగిన కార్యక్రమంలో ఆరాధ్య దీనిని ప్రదర్శించిందని.. ఆమె ప్రతిభను గుర్తించి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరును నమోదు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.దివాకర్, జి. సాయిశైలజ విద్యార్థినితో పాటు ఉపాధ్యాయుడు గంగాధరరావును అభినందించారు. కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సీనియర్ మేనేజర్ కె.ప్రకాశరావు, శివం తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో యాత్రి నివాస్

- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.12.3 కోట్లతో పనులు ప్రారంభం
- 2024 నాటికే 85 శాతం పనులు పూర్తి
- కూటమి ప్రభుత్వంలో నత్తనడకన సాగిన పనులు
- స్టార్ హోటల్ సౌకర్యాలతో ఎట్టకేలకు అందుబాటులోకి..
- ఏపీటీడీసీ సైట్‌లో మాత్రం పాత చిత్రమే



యాత్రి నివాస్

సాక్షి, విశాఖపట్నం: అందమైన విశాఖ జిల్లాకు మరిన్ని పర్యాటక హంగులు తీసుకొచ్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు ఇప్పుడు కొత్త ఫలాలను ఇస్తున్నాయి. దేశ విదేశీ పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా బీచ్‌రోడ్డులోని హరిత హోటల్ యాత్రి నివాస్ సుందరీకరణ పనులు పూర్తయి.. తాజాగా అందుబాటులోకి వచ్చాయి. ఈ హోటల్ స్టార్ హోటళ్లకు దీటుగా ఉన్నా.. కూటమి ప్రభుత్వం మాత్రం గత ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతూనే ఉంది. ఏపీటీడీసీ వెబ్‌సైట్‌లో యాత్రి నివాస్ బుకింగ్స్ కోసం పాత ఫొటోనే కొనసాగిస్తోంది.

పర్యాటకుల స్వర్గధామంగా విశాఖ

విశాఖపట్నం ప్రకృతి సౌందర్యంతో పాటు అనేక పర్యాటక ఆకర్షణలను కలిగి ఉంది. ఇది దేశ, విదేశీ పర్యాటకులకు స్వర్గధామంగా మారింది. ఏటా విశాఖకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతూ ఉంది. ఈ నేపథ్యంలో పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో యాత్రి నివాస్ భవనాన్ని ఆధునికీకరించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం రూ.12.5 కోట్లతో యాత్రి నివాస్‌ను తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టింది. అప్పుఘర్‌లోని బీచ్‌వ్యూలో ఉండే ఈ హరిత హోటల్‌లో మొత్తం 4 అంతస్తుల్లో 46 గదులు, రెస్టారెంట్ ఉన్నాయి. అయితే.. 25 ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో గదుల్లో లీకేజీలు, కొన్ని చోట్ల పెచ్చులూడటం వంటి సమస్యలు తలెత్తాయి. భవిష్యత్తులో పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉన్నందున.. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దీనిని సుందరీకరించింది.

అప్పటికే 85 శాతం పూర్తి

2023 డిసెంబర్‌లో పనులు ప్రారంభం కాగా.. 2024 ఎన్నికల సమయానికి దాదాపు 85 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. పలు పరిణామాల అనంతరం పనులు ప్రారంభమై.. రెండు నెలల కిందట పూర్తయ్యాయి. ఆధునికీకరించిన యాత్రి నివాస్‌లో 42 ఏసీ గదులు ఉన్నాయి. వీటిని ఏసీ సూట్, ఏసీ డీలక్స్, ఏసీ ఎగ్జిక్యూటివ్ రూమ్‌లుగా విభజించారు. ఇద్దరు పర్యాటకులకు డిమాండ్‌ను బట్టి ఏసీ సూట్ రూమ్ ధర రూ.3,750 నుంచి రూ.4,200 వరకు, ఏసీ డీలక్స్ రూమ్ రూ.4,625 నుంచి రూ.5,180 వరకు, ఏసీ ఎగ్జిక్యూటివ్ రూమ్ ధర రూ.3,125 నుంచి రూ.3,500 వరకు నిర్ణయించారు. వీటికి పన్నులు అదనంగా ఉంటాయి. గదులతో పాటు అత్యాధునిక వసతులతో రెస్టారెంట్, బార్, వెయిటింగ్ హాల్, కాన్ఫరెన్స్ హాల్ మొదలైనవి అందుబాటులోకి వచ్చాయి. హరిత హోటల్‌లో ఎక్కువగా పశ్చిమ బెంగాల్, ఒడిశాతో పాటు ఉత్తర భారత్ నుంచి వచ్చే పర్యాటకులు బస చేస్తుంటారు. టూరిజం ప్యాకేజీలో వచ్చే వీరికి ఈ హోటల్ ముఖ్యమైన గమ్యస్థానం. అందుకే, అత్యాధునిక సౌకర్యాలతో పాటు ఆయా రాష్ట్రాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా కొత్త వంటకాలను అందించేలా రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు.

పాత ఫొటోతోనే బుకింగ్స్


ఏపీటీడీసీ వెబ్‌సైట్‌లో ఇంకా పాత యాత్రి నివాస్ ఫొటో

యాత్రి నివాస్‌ను అధికారికంగా ఇంకా ప్రారంభించనప్పటికీ.. పర్యాటకులు బుక్ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో రూమ్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆన్‌లైన్‌లో ఏపీటీడీసీ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. అయితే కూటమి ప్రభుత్వం యాత్రి నివాస్‌పై అక్కసు చూపిస్తూనే ఉంది. గత ప్రభుత్వం అద్భుతంగా తీర్చిదిద్దినందున ఆ పేరు దానికి వస్తుందనే ఉద్దేశంతో పనులను ఆలస్యం చేసింది. ఇప్పుడు అందుబాటులోకి వచ్చినా.. పాత ఫొటోనే వెబ్‌సైట్‌లో ఉంచింది. ఈ ఫొటో చూసి పర్యాటకులు తమ పర్యటనను వాయిదా వేసుకునే అవకాశం ఉంది. పాత ఫొటో స్థానంలో కొత్తది ఉంచితే బుకింగ్స్ పెరిగే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం.

ఓటు చోరీపై ప్రజలకు సమాధానం చెప్పాలి

ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేసిన విదసం


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: 'మా ఓటు భద్రం.. చోరీ కానివ్వకండి'.. 'ఓటు చోరీపై ప్రజలకు సమాధానం చెప్పండి', 'బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ఆపండి' అని విదసం నాయకులు డిమాండ్ చేశారు. విస్తృత దళిత సంఘాల (విదసం) ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డా.బూసి వెంకట రావు ఆధ్వర్యంలో గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన భారత ఎన్నికల కమిషనర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ప్రతి పౌరుడికి ఒకే ఓటు, ఒకే విలువ ఉండగా.. దేశంలో ఇటీవల జరుగుతున్న ఓట్ల చోరీపై ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్, కర్ణాటకలోని మహాదేవపురలో జరిగిన ఓట్ల మాయాజాలంపై ప్రజల అనుమానాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల సంఘం.. ప్రశ్నించిన వారినే నిందిస్తోందని ఆయన విమర్శించారు. బీహార్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను పెద్ద సంఖ్యలో తొలగించడానికే ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతున్నారని, ఇది ఎన్నికల సంఘానికి రాజ్యాంగం కల్పించిన స్వయం నిర్ణయాధికారాన్ని దుర్వినియోగం చేయడమేనని ఆరోపించారు. భారతీయ ఓటరు హక్కులను ఎస్ఐఆర్ పేరుతో కాలరాయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. బీజేపీ ఎన్నికల కమిషన్‌ను నియంత్రిస్తోందన్నారు. మహాదేవపుర ఎంపీ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో బయటపడ్డ వేలాది నకిలీ ఓటర్లపై సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు సమాధానం చెప్పాలని ఎన్నికల సంఘానికి డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్న కార్యకర్తలు తమ ఓటరు కార్డులు చూపిస్తూ 'ఎన్నికల సంఘమా, మా ఓటు భద్రం, చోరీ కానివ్వొద్దు' అని నినాదాలు చేశారు. విదసం నేతలు సోడా దాసి సుధాకర్, గుడివాడ ప్రసాద్, బూల భాస్కరరావు, డి.నిర్మల, ఫ్రాన్సిస్, ఉత్తరాంధ్ర రాజ్యాంగ హక్కుల నేత బాగం గోపాల్, బనాస అధ్యక్షుడు టి.శ్రీరామ్ మూర్తి, పట్టా రామప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నకిలీ మద్యం


స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యంతో ఎక్సైజ్ అధికారులు

విశాఖ విద్య: నగరంలో నకిలీ మద్యం తయారు చేస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం పట్టుకుంది. అతని వద్ద నుంచి 70 నకిలీ మద్యం సీసాలు, 1.5 లీటర్ల హోమియోపతిక్ స్పిరిట్, 225 వివిధ రకాల బ్రాండ్ల ఖాళీ మద్యం సీసాలు, ఏడు బ్రాండ్ల 76 లిక్కర్ ప్యాకేజ్ కవర్లు, 335 సీసా మూతలు, 99 లేబుల్స్ స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు టెంపరేచర్ డ్యూయల్ గన్‌ను స్వాధీన పరచుకున్నారు. నగరంలోని సీతంపేటకు చెందిన కట్టమూరి రామకృష్ణ నకిలీ మద్యం వ్యాపారం చేస్తున్నాడనే సమాచారంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం నిఘా పెట్టి, పట్టుకున్నారు. రామకృష్ణ వద్ద నుంచి భారీగా నకిలీ మద్యంను స్వాధీనం చేసుకున్నారు. కేసు తదుపరి విచారణ కోసం మహారాణిపేట స్టేషన్‌కు అతన్ని అప్పగించినట్లు సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ సీఐ రవి కిరణ్, ఎస్ఐ ముసలి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసం.. నలుగురి అరెస్ట్



న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు

గోపాలపట్నం: చీటీల పేరుతో సుమారు 50 మంది వద్ద డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడిన నలుగురిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సీఐ ఎస్.వి.ప్రభాకర్ గురువారం వెల్లడించారు. గోపాలపట్నం ఇందిరానగర్‌కు చెందిన అంబళ్ల సత్యవతి, ఆమె కుటుంబ సభ్యులు బంగారు నాయుడు, తేజస్విని, నాగలక్ష్మి కలిసి చీటీల వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరు సుమారు 50 మంది వద్ద చీటీల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. చీటీలు పూర్తయిన తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వకుండా, బాధితులను బెదిరించి, మరో రెండు చీటీలు వేస్తేనే డబ్బులు ఇస్తామని వేధించేవారు. దీంతో కొద్ది నెలల కిందట బాధితులు పోలీసులను ఆశ్రయించగా, నిందితులు డబ్బులు ఇచ్చేస్తామని చెప్పడంతో బాధితులు కొంతకాలం వేచి చూశారు. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితులు ఇటీవల నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ఆశ్రయించారు. కొందరు ఆరు లక్షల రూపాయల వరకు చీటీలు వేశారని ఆయనకు తెలిపారు. డబ్బులు అడిగితే దాటవేయడం, బెదిరించడంతో ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కాగా.. సీపీ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటివరకు 22 మంది బాధితులు ఫిర్యాదు చేశారని, నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, బాధితుల వివరాలను పూర్తిస్థాయిలో వెల్లడిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఇంజినీర్ మృతి

తగరపువలస : మినీ వ్యాన్ ఢీకొని రోడ్డు దాటుతున్న రిటైర్డ్ ఇంజినీర్ మృతి చెందాడు. ఆనందపురం మండలం వేములవలస హైవేపై బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలివి. వేములవలసలోని సత్యకల్యాణి అపార్ట్‌మెంట్ రిటైర్డ్ ఇంజినీర్ ఎం.వి.వి.ఎస్.సాయికుమార్ కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో హైవే దాటుతుండగా ఆనందపురం నుంచి విశాఖ వైపు వెళ్తున్న మినీ వ్యాన్ డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయికుమార్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని 108లో ఆరిలోవ లోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించగా కొద్దిసేపటికే మృతి చెందాడు. ఆయన భార్య కల్యాణ విజయనగరం జిల్లాలో ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాక్టరీస్ శాఖ అధికారులపై విచారణ

విశాఖ సిటీ : ఫ్యాక్టరీస్ శాఖ అధికారుల అవినీతి ఆరోపణల కేసులో విచారణాధికారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకర్‌రెడ్డి, సర్కిల్-1 ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.సుధాకర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. దీనిపై శాఖాపరమైన విచారణకు ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఇన్సురెన్స్ మెడికల్ సర్వీసెస్ వి.ఆంజనేయులను ప్రభుత్వం నియమించింది. అలాగే అధికారులపై నమోదు చేసిన అభియోగాల వివరాలను అందించేందుకు విశాఖ రేంజ్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ బి.విజయకుమార్‌ను ప్రజెంటింగ్ అధికారిగా వేసింది. అధికారులపై మోపిన అభియోగాలను విచారణ సమయంలో విచారణాధికారికి సమర్పించాలని ఆదేశించింది. రెండు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదికను అందజేయాలని ఉత్తర్వులో పేర్కొంది.

వుడా ప్లాట్లకు మౌలిక సదుపాయాలు కల్పించండి

సీతంపేట: వుడా భూసేకరణ లబ్ధిదారుల నుంచి 2009-11 మధ్య కాలంలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోయామని వుడా ప్లాట్ ఓనర్స్ సంఘం ప్రతినిధులు పీలా అప్పలనాయుడు, సీతారామరాజు, దత్తిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. భూసేకరణ పద్ధతిలో 2009 నుంచి 2011 మధ్య కాలంలో అప్పట్లో వుడా రుషికొండ, మధురవాడ, కొమ్మాది ఓజోన్ వ్యాలీ ప్రాంతాల్లో భూసేకరణ చేసి భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు 750 చదరపు గజాల డెవలప్డ్ సైటు సర్వే నంబరు 34, 35 (రుషికొండ)లో భూమి కేటాయించిందన్నారు. ఇలా వుడా రైతులకు కేటాయించిన 450 సైట్లను పలువురు కొనుగోలు చేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ ప్లాట్లకు నీరు, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ సదుపాయాలు కల్పించకుండా వదిలేశారన్నరు. ఏళ్ల తరబడి అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వుడా డెవలప్ చేస్తుందని రైతులు ఎంతో నమ్మకంగా ఉన్నారని, రైతుల నుంచి ప్లాట్లు కొనుగోలు చేసి తాము ఆర్థికంగా నష్టపోయామన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ప్లాట్లు చెల్లవని 2012లో, వుడా అధికారులతో కుమ్మక్కై రైతులు ప్లాట్లు పొందారని ప్రకటన వెలువడిందన్నారు. 75 శాతం ప్లాట్లు రైతులు వేరే వారికి విక్రయించారని, కొనుగోలు చేసిన ప్లాట్లలో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ప్లాట్లు చెల్లవని ప్రకటన గురించి అధికారులను అడిగితే 2014లో విజిలెన్స్ విచారణ చేపట్టి రైతులకు ప్లాట్ల కేటాయింపు చెల్లదని చెప్పిందన్నారు. వీఎంఆర్‌డీఏగా మారిన తర్వాత తమకు న్యాయం చేయాలని అడిగితే 2009-11 రికార్డులు తమ వద్ద లేవని తప్పించుకుంటున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకెళ్లి ఐదు నెలలు గడిచినా తమకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పలు రైళ్లకు తాత్కాలిక హాల్ట్‌ల కొనసాగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా ఆయా స్టేషన్లలో కొనసాగుతున్న హాల్ట్‌లను మరి కొంతకాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి భువనేశ్వర్-సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్ సత్తెనపల్లె, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌ల్లోను, సెప్టెంబరు 20వ తేదీ నుంచి పూరీ-తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 22వ తేదీ నుంచి తిరుపతి-పూరీ (17480) ఎక్స్‌ప్రెస్‌లకు కొవ్వూరు స్టేషన్‌లోను, సెప్టెంబరు 20వ తేదీ నుంచి బిలాస్‌పూర్-తిరుపతి(17481) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 18వ తేదీ నుంచి తిరుపతి-బిలాస్‌పూర్(17482) ఎక్స్‌ప్రెస్‌లకు కొవ్వూరు స్టేషన్‌లో హాల్ట్‌లు కొనసాగుతాయి. భువనేశ్వర్-రామేశ్వరం(20896)(కొత్త నెంబర్20849) ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 26వ తేదీ నుంచి రాజమండ్రి స్టేషన్‌లో, రామేశ్వరం-భువనేశ్వర్(20895) కొత్త నెంబర్ 20850) ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 28వ తేదీ నుంచి రాజమండి స్టేషన్‌లో, హౌరా-పుదుచ్చేరి(12867) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 28వ తేదీ నుంచి రాజమండ్రి స్టేషన్‌లో, పుదుచ్చేరి-హౌరా(12868)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 24వ తేదీ నుంచి రాజమండ్రి స్టేషన్‌ల్లో హాల్ట్‌లు కొనసాగుతాయి.

కబ్జా కోరల్లో నగరంపాలెం చెరువు

- ఇప్పటికే సగం ఆక్రమణ
- తాజాగా మరో అర ఎకరం మేర ఆక్రమణకు రెడీ
- రూ.5 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఎసరు
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు
- మధురవాడలో జలవనరుల విధ్వంసం


పూడ్చివేసిన చెరువు స్థలంలో నిర్మాణానికి సిద్ధం చేసిన గుర్తులు


కబ్జా కాటుకు గురై సగానికి కుదించుకుపోయిన నగరంపాలెం చెరువు

మధురవాడ: ఒకవైపు నీటి కొరతతో నగరం అల్లాడుతుంటే.. మరోవైపు సహజ సిద్ధమైన జలవనరులను కాపాడాల్సిన అధికారుల నిర్లక్ష్యం కబ్జాదారులకు వరంగా మారుతోంది. మధురవాడలోని నగరంపాలెం చెరువును కొందరు బరితెగించి కబళిస్తున్నారు. సుమారు రూ.5 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా పూడ్చివేస్తున్నా.. జీవీఎంసీ, రెవెన్యూ యంత్రాంగాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ.. చెరువు ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చినా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నగరంలో నీటి యుద్ధాలు సర్వసాధారణమయ్యాయి. ఈ నేపథ్యంలో సహజ జలవనరులైన చెరువులను పరిరక్షించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ విశాఖలో స్వతంత్రనగర్, కొమ్మాది వంటి ప్రాంతాల్లో చెరువులు కనుమరుగై కాలనీలుగా మారిపోయిన చరిత్ర కళ్లముందే ఉంది. ఇప్పుడు ఆ జాబితాలోకి నగరంపాలెం చెరువు కూడా చేరబోతోంది.

సగానికి పైగా ఆక్రమణ

విశాఖ రూరల్ మండలం, మధురవాడ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 65/10లో 2.90 ఎకరాల విస్తీర్ణంలో నగరంపాలెం చెరువు ఉంది. రెవెన్యూ రికార్డుల్లో ట్యాంక్ పోరంబోకుగా నమోదైంది. అయితే ఇప్పటికే కబ్జాదారుల పుణ్యమా అని చెరువు సగానికి పైగా ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం కేవలం 1.50 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. తాజాగా.. మిగిలిన భూమిలో నుంచి మరో అర ఎకరం భూమిని 'సామాజిక అవసరాల' పేరుతో కొందరు పూడ్చివేయడం ప్రారంభించారు. నిర్మాణాల కోసం ఇప్పటికే సరిహద్దులను మార్కింగ్ చేసి సున్నం వేశారు.


ప్రైవేటు అవసరాలకు పెద్దపీట

చెరువు భూమిలో ఇప్పటికే కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా ఓ ప్రైవేటు లేఅవుట్‌కు దారి కూడా ఈ చెరువు భూమి నుంచే ఏర్పాటు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమిని ప్రైవేటు ప్రయోజనాలకు అనుకూలంగా మార్చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇక చెరువుకు జీవనాధారమైన నీటి ప్రవాహ మార్గాలను(గెడ్డలను) సైతం కబ్జాదారులు వదల్లేదు. వర్షపు నీరు చెరువులోకి చేరే మార్గాలను, చెరువు నిండిన తర్వాత నీరు బయటకు ప్రవహించే మార్గాలను పూర్తిగా ఆక్రమించుకున్నారు. దీనివల్ల చెరువు సహజ సిద్ధమైన ఉనికిని కోల్పోయి, కేవలం నిలిచిన నీటి గుంతగా మారే ప్రమాదం ఏర్పడింది.

ప్రకృతి ప్రేమికుల ఆవేదన

మధురవాడలో ప్రభుత్వ భూములకు కొదవ లేదు. అయినప్పటికీ కొందరి కళ్లు ఈ చెరువుపైనే పడటం దురదృష్టకరం. ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టంగా జలవనరుగా ఉన్న భూమిని కొందరు స్వాహా చేస్తుంటే సంబంధిత జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని ప్రకృతి, పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చెరువును కబ్జాదారుల బారి నుంచి కాపాడి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎగసిపడుతున్న అలలు


ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్

అల్పపీడనం ప్రభావంతో సాగరతీరం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సముద్రం ముందుకు వచ్చేసింది. ఇసుక తెన్నుల మీద కెరటాలు చొచ్చుకు రావడంతో పర్యాటకులకు బీచ్‌లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.